క్లుప్తంగా

స్పీడ్ బ్రేకర్స్ వేయాలని వినతి

తుక్కుగూడ: ప్రమాదాలకు నిలయంగా మారిన రావిర్యాల వండర్‌లా నుంచి ఆర్‌సీఐ వరకు స్పీడ్ బ్రేకర్స్ వేయించాలని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, బీజేపీ నేత వై.శివకుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్డులో స్పీడ్ బ్రేకర్స్ వేయించాలని 2023 జనవరిలో కౌన్సిల్ రూ.5లక్షల నిధులను తీర్మానించామన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఇప్పికే కేటాయించిన నిధులతో స్పీడ్ బ్రేకర్స్ వేయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు.

కాంగ్రెస్ కార్పొరేషన్ ఎస్సీ చైర్మన్‌గా కుమార స్వామి



బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ ఎస్సీ చైర్మన్‌గా బొల్లపల్లి కుమార స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ డిపార్ట్‌మెంట్ నియోజకవర్గం చైర్మన్ శ్రీధర్ జారీ చేసిన నియామక ఉత్వర్వులను, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ చేతుల మీదుగా కుమార స్వామి అందుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు అందేలా చూడాలని కేఎల్ఆర్ సూచించారు. నియామకానికి సహకరించిన పార్టీ పెద్దలకు స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పార్టీ సన్నాహక సమావేశం

తుక్కుగూడ: పార్టీ జిల్లా ముఖ్య నాయకులతో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ.8 లక్షల నిధులు



హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధి నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్ ఆవరణలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు ప్రభుత్వం రూ.8 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో శనివారం గ్రామస్తులు అక్కడ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ జి.ప్రభాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు ఎండీ అఫ్జల్‌బేగ్, పాఠశాల కమిటీ చైర్మన్ శివలీల, చెన్నకేశవ ఆలయ కమిటీ చైర్మన్ కె.రూప్‌చందర్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ కృషితో హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.సంజీవరెడ్డి, దర్శన్, ఎండీ పర్వేజ్, వి.బాబు, ఎండీ అజారుద్దీన్, ఎస్.శ్రీహరి, ఎండీ ఫయాజ్‌బేగ్, ఎండీ అమృత్, షైబాజ్‌బేగ్, ఉపాధ్యాయులు శేఖర్, వి.అంజలి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

బాచుపల్లిలో వైద్య శిబిరం



వైద్య శిబిరానికి హాజరైన బాచుపల్లి గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధిలోని బాచుపల్లిలో శనివారం లిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ బాల్‌రాజ్, డాక్టర్ శంకర్‌రెడ్డి బృందం 350 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించి, మూడు నెలలకు ఒకసారి ఆరోగ్యవంతులైన యువత రక్తదానం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండాల సురేష్, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, నాయకులు కృష్ణ, నరసింహ, విజయ్, యుగంధర్, ఎగిరిశెట్టి నరేష్, ఎగిరిశెట్టి రాజు,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి సీలింగ్ ఫ్యాన్‌లు అందజేత

నందిగామ: మండలల కేంద్రమైన నందిగామ శివారులోని పారిశ్రామిక వాడ సమీపంలో పునఃనిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి నందిగామకు చెందిన చెన్నగళ్ల సందీప్ సీలింగ్ ఫ్యాన్‌లను శనివారం అందజేశారు. అనంతరం దాత సందీప్‌ను అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

సూర్యగిరి నృసింహ ఆలయ వార్షికోత్సవం

- మూడు రోజుల పాటు వేడుకలు
- ఏర్పాట్లు సిద్ధం చేసిన ఉత్సవ కమిటీ





సూర్యగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం (ఇన్‌సెట్లో) స్వామివారు

తుక్కుగూడ: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఎల్లమ్మ ఆలయాల్లో రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం ఒకటి. ఆలయ ఆవరణలో మూడేళ్ల క్రితం దాతల సహకరంతో శ్రీ సూర్యగిరి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం నిర్మించారు. ఇందులో లక్ష్మీనర్సింహ స్వామి, భవాని శ్రీ రామలింగేశ్వర స్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి, నందీశ్వరుడు, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు తృతీయ వార్షికోత్సవం నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

స్వయంభు శ్రీ సూర్యగిరి ఎల్లమ్మను దర్శించుకుంటే కష్టాలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ప్రతి మంగళవారం రంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్‌తో పాటు, నగరం నుంచి వందలాంది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారు. అమ్మవారితో పాటు శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి, భవాని శ్రీ రామలింగేశ్వర స్వామి, పంచముఖ ఆంజనేయ స్వాములను దర్శించుకుంటారు.

కార్యక్రమాల వివరాలు

తొలి రోజు ఆదివారం ఉదయం మంగళ వాయిద్యాలు, స్వస్తి వాచనం, విఘేశ్వర పూజ, పుణ్యాహ వాచనం, నాంది అంకుర్పారణ, పంచ గవ్య సమ్మేళనం యజ్ఞశాల. సాయంత్రం నవగ్రహ మాతృక ప్రధాన దేవాతా మంత్ర వాచనములు. హారతి, మంత్ర పుష్పం. 24 లక్ష్మీనర్సింహ స్వామి, భవాని రామలింగేశ్వర స్వామి వార్లకు విశేష అభిషేకం. నవగ్రహ మాతృక యోగిని, వాస్తు క్షేత్రపాలక బ్రహ్మాది మండల దేవాత మంత్ర హవనం. 25న స్థాపిత దేవత పూజలు, నవగ్రహం. ఉదయం 11 గంటలకు శ్రీలక్ష్మీనర్సింహ స్వామి తిరుకల్యాణం, హారతి, మంత్రపుష్పం. అనంతరం అన్నదాన వితరణ. అదే రోజు ఉత్సవాలు ముగింపు.

జయప్రదం చేయాలి



సూర్యగిరి ఎల్లమ్మ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ తృతీయ వార్షిక వేడుకలు నేటి నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి. భక్తుల కోసం ఏర్పాట్లను పూర్తి చేశాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలి.

– రెడ్డిగళ్ల రత్నం కార్యనిర్వాహకుడు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఎంఈఓ నరసింహకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయిందన్నారు. ప్రస్తుత నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకుండా వారి పొట్టగొడుతుందన్నారు. నెలకు రూ.10 వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి కల్యాబ్‌కార్ శ్రీనివాస్, కార్మికులు గీత, లక్ష్మమ్మ, మంజుల, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

- బీజేపీ మున్సిపల్ నాయకుడు షేర్‌సింగ్ యోగి



బృందావన్ కాలనీలో మురుగు సమస్యను పరిశీలిస్తున్న షేర్‌సింగ్ యోగి తదితరులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి బృందావన్ కాలనీలో కొన్ని రోజులుగా మురుగు రోడ్లపై పారుతుండడంతో స్థానికు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నెల రోజులుగా ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను విన్నవించినా పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకుడు షేర్‌సింగ్ యోగి ఆరోపించారు. శనివారం ఆయన స్థానికులతో కలిసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా షేర్‌సింగ్ యోగి మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి అత్యధిక ట్యాక్స్‌లు చెల్లించేది శ్రీరాం కాలనీ ప్రజలే అయినప్పటికీ, అధికారులు సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇళ్ల నడుమ పారుతున్న మురుగుతో స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వెంకటేశ్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్

కొందుర్గు: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన జిల్లేడ్‌చౌదరిగూడ మండలం వీరన్నపేట, గుర్రంపల్లి గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలు, మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు ఆరు వారాలుగా బిల్లులు పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం కూలీలకు 2007లో పనిముట్లు ఇవ్వడం జరిగిందని, ఇప్పటివరకు పనిముట్లు ఇవ్వకపోవడంతో కూలీలే డబ్బు ఖర్చుచేసి పనిముట్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఉపాధిహమీకి సరిపడ నిధులు ఇవ్వకుండా పథకాన్ని నీరుగార్చుతుందన్నారు. ఇప్పటికై న ప్రభుత్వం స్పందించి ఉపాది పథకాన్ని మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లావణ్య, నవీన్, యాదయ్య, స్వప్న, నర్సమ్మ, కృష్ణయ్య పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి పనిచేద్దాం

శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ

శంకర్‌పల్లి: మార్కెట్ అభివృద్ధికి సభ్యులమంతా కలిసి ముందుకు సాగుదామని నూతన చైర్‌పర్సన్ గోవిందమ్మ అన్నారు. శనివారం ఆమె అధ్యక్షతన వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో తొలి సర్వ సభ్య సమావేశం ఏర్పాటు చేశారు. డైరెక్టర్లలంతా ఒకరినొకరు పరిచయం చేసుకుని, వ్యవసాయ మార్కెట్ ని అభివృద్ధిలోకి తీసుకురావాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం గోవిందమ్మ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి వ్యవసాయం మార్కెట్ ప్రస్తుతం నష్టాలలో ఉందని.. వీలైనంత త్వరగా లాభాల్లోకి తీసుకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మార్కెట్‌కి ఉల్లి ఒక్కటే వస్తోందని.. మిగిలిన పంటలు సైతం వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌కి సంబంధించిన దుకాణాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఇతరులకు ఇచ్చి అద్దె ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, సెక్రెటరీ ఐశ్వర్య లక్ష్మి, శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గోవిందమ్మ

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న నేదునూరు గ్రామస్తులు

కందుకూరు: మండల పరిధి నేదునూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరు కల్యాణోత్సవంలో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లతో రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుడు రాముశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చి గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. దీంతో గ్రామంలో ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నీటి వృథా అరికట్టాలి

జలమండలి సాహెబ్‌నగర్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులకు నీటిపై అవగాహన కల్పిస్తున్న జలమండలి అధికారులు

బడంగ్‌పేట్: నీటి వృథాను అరికట్టాని జలమండలి అధికారులకు విద్యార్థులకు సూచించారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సంరద్భంగా లార్డ్స్ ఒలంపియాడ్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జలమండలి సాహెబ్‌నగర్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి ఇంకుడుగుంతను ఏర్పాటు చేసుకోని వర్షపునీటిని ఒడిసి పట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ సరిత, విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, గాయత్రి ఫౌండేషన్ సీఈఓ రవికుమార్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పేరిట ప్రజాధనం వృథా

వనస్థలిపురం: అభివృద్ధిపనుల మాటేమోగానీ, ఆ పనుల పేరిట కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధి పొందుతున్నారు. అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతంలోని పలు కాలనీలు కళ్లముందు కనిపిస్తున్నా వాటిని గాలికి వదిలేసి, అభివృద్ధి చెందిన కాలనీలలోనే ఉన్న రోడ్లను తవ్వడం , మళ్లీ నిర్మించడం పనులు చేపడుతుండడంతో ప్రజా ధనం వృథా అవుతోంది. వనస్థలిపురం ఫేజ్-2లో కాంప్లెక్స్ సమీపంలో శుభ్రంగా ఉన్న రోడ్డును ఒకటి, రెండు చోట్ల నీరు నిలుస్తోందన్న సాకుతో మొత్తం రోడ్డును తవ్వి పడేశారు. ఇంతకంటే అధ్వాన్నంగా ఉన్న రోడ్లను వదిలేసి ఈ రోడ్డును ఎందుకు తవ్వి పోశారో తెలియక స్థానికులే అయోమయం చెందుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి బాగున్న రోడ్లనే మళ్లీ మళ్లీ నిర్మిస్తూ కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధి పొందుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మహేశ్వరాన్ని ‘ఫ్యూచర్’లో కలపండి

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు జేఏసీ నేతల వినతి



కేఎల్లార్‌ను వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు కోరారు. శనివారం జేఏసీ చైర్మన్ రఘుపతి ఆధ్వర్యంలో తక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ.. విలీనం విషయం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. మహేశ్వరం, కందుకూరు మండలాల విలీనం గురించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అనంతరం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జేఏసీ నాయకులు కడారి జంగయ్య, మిద్దె సుదర్శన్‌రెడ్డి, ఈశ్వర్, కరుణాకర్ రెడ్డి, అంద్యా నాయక్, మల్లేశ్ యాదవ్, హన్మగళ్ల చంద్రయ్య, వర్కల యాదగిరి గౌడ్, యాదయ్య, రాఘవేందర్ రెడ్డి, పాండు నాయక్, శివ, యాదగిరి రెడ్డి, జగన్‌రెడ్డి, దత్తు నాయక్, రవి నాయక్, యాదగిరి, సుదర్శన్ యాదవ్, బాల్‌రాజ్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తములుగా ఎదగాలి



వేదికపై చిన్నారుల నృత్యం

తుక్కుగూడ: కష్టపడి చదివి ఉత్తములుగా ఎదగాలని మిలియన్ స్కూల్ ప్రిన్స్‌పాల్ కె.విమల అన్నారు. శనివారం పుర కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



మహిళలకు పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే సబితా రెడ్డి

పహాడీషరీఫ్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ఎమ్మెల్యే సబితా రెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఆమె జల్‌పల్లి మున్సిపాలిటీ పహాడీషరీఫ్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. వారికి పండ్లు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కైసర్ బామ్, సూరెడ్డి కృష్ణారెడ్డి, బర్కత్ అలీ, ఎంఏ హుస్సేన్, యంజాల జనార్దన్, పల్లపు శంకర్, యాతం పవన్ కుమార్ యాదవ్, అర్జున్, సయీద్ పటేల్, సయ్యద్ హుస్సేన్, సయ్యద్ ఫెరోజ్, మేరాజ్ ఖాన్, మక్దూం పటేల్, అలీ మన్సూరీ, మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్



చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

షాద్‌నగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఏబీవీపీ షాద్‌నగర్ నగర కార్యదర్శి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు డిగ్రీ కళాశాల విద్యార్థులతో షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి సరైన కేటాయింపులు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు 10శాతం నిధులు కూడా కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. విద్యా కమిషన్‌కు 20 శాతం నిధులు కేటాయించాలని సూచించినా పట్టించుకోలేదని మండి పడ్డారు. రాష్ట్రంలో చాలా ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడం, సదుపాయాలు లేకపోవడంతో పేద విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, మహేందర్, నవీన్, సాయి, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



ప్రత్యేక వేషధారణలో విద్యార్థులు

కొత్తూరు: సిద్ధాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంగూర్‌నాయక్, హెచ్ఎం ప్రసన్నలక్ష్మీ, రఘుపాల్, నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాలలు మౌనం వీడాలి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: మాలలు హక్కులు, అవకాశాలు కోల్పోతున్న మౌనం వహించడం మాలల అస్తిత్వానికే ప్రమాదమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. శనివారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్లలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పెట్టిన ఎస్సీ డిక్లరేషన్ సభలో ఎస్సీ రిజర్వేషన్ల శాతాన్ని జనాభా ధామాషా ప్రకారం పెంచిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పి దళితులను మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం 2025 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మాలలను అత్యంత పాశవింకగా మనువాదులు, దోహ్రులుగా కించపరుస్తున్న నోరు మెదపని మాలలు తమ స్వేచ్ఛను కోల్పోయినట్లేనని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన రిజ్వేషన్ల ద్వారా వచ్చే అవకాశాలను కోల్పోతున్న మౌనం వహించడం సరైనది కాదన్నారు. మాల సోదరులు ఇప్పటికైనా ఉద్యమానికి సిద్ధంకావాలన్నారు.

రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోండి

- కాంగ్రెస్ 24వ డివిజన్ అధ్యక్షుడు మల్లారెడ్డి



కేఎల్ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లారెడ్డి

బడంగ్‌పేట్: పైప్‌లైన్ ఏర్పాటుకు తవ్విన ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన పార్టీ నాయకులతో కలిసి కాంగ్రెస్ నియోకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. అల్మాస్‌గూడ శివాలయం నుంచి శ్రీశ్రీ హోమ్స్, న్యూమారుతినగర్, హనుమాన్‌నగర్, ఎంఆర్ఆర్ కాలనీ, శ్రీసాయిహోమ్స్, వెంకటేశ్వర కాలనీ, ఏఆర్‌సీఆర్ కాలనీ, విశాఖనగర్, జయశంకర్ కాలనీ, వైఎస్ఆర్ నగర్ వరకు ఉన్న ప్రధాన రహదారిని మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు పైప్‌లైన్లకోసం తవ్వి రెండేళ్లు దాటిపోయిందన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు వేయకుండా వదిలివేయడంతో నేడు గుంతలమయంగా మారిపోయిందన్నారు. వాహనదారులు, పాదచారులు ఈ రోడ్డు మీదుగా ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గుర్రంగూడకు లింక్ రోడ్డుగా ఈ మార్గాన్ని త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే పనులు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, శ్రీహిల్స్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, శ్రీశ్రీహోమ్స్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.